క్లుప్తంగా

ఘనంగా నల్ల మారమ్మ పండగ



నల్లమారమ్మ ఆలయం వద్ద భక్తులు

దత్తిరాజేరు: మండలంలోని పెదకాద–చిన కాద గ్రామాల మధ్యలో ఉన్న నల్లమారమ్మ తల్లి పండగను రెండు గ్రామాల ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి తుడుపులమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



తుడుపులమ్మ తల్లి ఆలయం

వేపాడ : మండలంలోని నీలకంఠరాజపురంలో నూతనంగా నిర్మించిన తుడుపులమ్మ గ్రామదేవత ఆలయం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. బుధ, గురు వారాల్లో హోమాలు, జలాధి, క్షీరాధి, ధాన్యాధి వాసములు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. శుక్రవారం వేదపండితుల మంత్రోచ్చారణాలతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరగనున్నట్టు తెలిపారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం



చిన్నతామరాపల్లిలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

బొండపల్లి: ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టని నివాసం ఉంటూ ఎటువంటి అభ్యంతరాలు లేని వారు జీవో నంబరు 30 ప్రకారం ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరణకు అర్హులైన వారు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని చిన్నతామరాపల్లి గ్రామంలో మంగళవారం ఇళ్ల నిర్మాణదారులకు అవగాహన కల్పించారు. 150 గజాల లోపు ప్రభుత్వ స్థలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టని అభ్యంతరం లేని ఇళ్ల యజమానులు దరఖాస్తు చేసుకొని క్రమబద్ధీకరించుకోవచ్చని చెప్పారు. వీఆర్‌ఓ గెద్ద నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో క్విజ్ పోటీలు



లైబ్రరీలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి

శృంగవరపుకోట: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం పలు పాఠశాలల విద్యార్థులకు లైబ్రేరియన్ డి.శ్రీధర్ నేతృత్వంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేర్వేరు పాఠశాలలు, వేర్వేరు తరగతులకు చెందిన విద్యార్థులను గ్రూపులుగా ఏర్పాటు చేసి, గణితం, సైన్స్, సోషల్ సంబంధిత ప్రశ్నలతో పాటూ, పురాణాలకు సంబంధించిన ప్రశ్నలతో క్విజ్ ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పిల్లలకు క్యారమ్స్, చెస్ ఆటలు నేర్పించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచితంగా మొక్కల పంపిణీ



రైతులకు మొక్కలు అందజేస్తున్న రామకృష్ణ

శృంగవరపుకోట: పట్టణ కేంద్రంలోని గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో మంగళవారం రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ఉష్ణోగ్రతలను తగ్గించటం, కాలుష్యం కోరల నుంచి ప్రజలను కాపాడుకోవటం కోసం మనకు ఉన్న ఏకైక మార్గం మొక్కలు నాటడం, చెట్లను పెంచటం, సామాజిక అడవులను పరిరక్షించటం ఒక్కటే అన్నారు. ఇందుకోసం గత కొన్ని దశాబ్దాలుగా ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ మొక్కలతోనే సాధ్యమన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వి.త్రినాథ్, పి.దిలీప్, వై.రాంప్రసాద్, ఆర్.వెంకటేష్, పి.ఈశ్వరరావు, ఎ.ప్రభాస్, చిన్నారులు హృషికేష్, లాస్య తదితరులు పాల్గొన్నారు.

స్టాంప్ డ్యూటీకి మోకాలడ్డు..

- 199 రెవెన్యూ గ్రామాలకు బకాయిపడిన నిధులు
- అనుమతులు ఇవ్వని కూటమి ప్రభుత్వం



గజపతినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయం

గజపతినగరం రూరల్: గ్రామాల్లోని పారిశుధ్యం మెరుగుపడాలన్నా.. తాగునీరు సక్రమంగా అందించాలన్నా.. పంచాయతీలలో ప్రజలకు సకాలంలో సేవలు అందించాలన్నా సిబ్బందికి చెల్లించేందుకు నిధులు ఎంతో అవసరం పడుతోంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులతో పాటు ప్రతీ ఏడాది గ్రామ రెవెన్యూ పరిధిలోని రిజిస్ట్రేషన్ జరుగుతున్న భూముల నుంచి ఆయా పంచాయతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ బకాయిలకు రాష్ట్ర ప్రభుత్వం మోకాలడ్డుతోంది. గడిచిన కొంత కాలంగా స్టాంప్ డ్యూటీ నిధులు అందక పంచాయతీల నుంచి పారిశుధ్య సిబ్బందికి కూడా బకాయిలు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా స్టాంప్ డ్యూటీ నిధులు మంజూరు జరగడంతో పంచాయతీ కార్యకలాపాలకు ఇబ్బంది కలిగేది కాదు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి రావాల్సిన బకాయిలు రాకపోవడంతో ఆయా పంచాయతీల ప్రజాప్రతినిధుల నుంచి సిబ్బంది కూడా నానా ఇబ్బందులకు గురవుతన్నారు.

199 రెవెన్యూ గ్రామాలకు..

గజపతినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలోని 199 రెవెన్యూ గ్రామాలకు గడిచిన నవంబర్ 2022 నుంచి స్టాంప్ డ్యూటీ నిధులు బకాయిలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఏటా రూ.24కోట్ల నుంచి 30 కోట్ల వరకూ ఆదాయం లభిస్తుందని, ఏటా 5వేల నుంచి ఆరు వేల వరకూ దస్తావేజులు రిజిస్ట్రేషన్ జరుగుతుందని సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఒక్కో దస్తా వేజు నుంచి 7.5 కమీషన్ కక్షిదారుడి నుంచి వసూలు చేస్తున్నారు. ఇందులో 6శాతం ప్రభుత్వ ఖజానాకు చేరగా 1.5శాతం సంబంధిత రెవెన్యూ గ్రామాలకు స్టాంప్ డ్యూటీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. గడిచిన కొంత కాలంగా స్టాంప్ డ్యూటీ నిధులు గ్రామాలకు విడుదల చేయకపోవడంతో సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు ఎదురు చూపులు చూస్తున్నారు.

ఇదిగో.. అదిగో...

గ్రామాల పరిధిలో ఉన్న భూములు రిజిస్ట్రేషన్ జోరుగా సాగుతోంది. దీనివల్ల ఆదాయం సంబంధిత ప్రభుత్వానికి మెండుగా లభిస్తుంది. గ్రామాలకు చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ ఇప్పటికీ ఇవ్వకపోవడంతో గ్రామంలో పారిశుధ్య సిబ్బందికి, అలాగే గ్రామాభివృద్ధికి ముందుకు వెళ్లలేకపోతున్నాం. ఇప్పటికే పలుమార్లు స్టాంప్ డ్యూటీ నిధులు మంజూరు చేయమని రిజిస్ట్రార్‌కు, ఖజానా కార్యాలయానికి పలుమార్లు విన్నవించుకున్నాం. ఇదిగో అదిగో అంటున్నారే తప్ప స్పందన లేదు.

– సొంట్యాన విజయలక్ష్మి, సర్పంచ్, పురిటిపెంట

ఆదేశాలు రాలేదు..



గడచిన నవంబర్ 2022 నుంచి మార్చి 2023 వరకూ స్టాంప్ డ్యూటీ ఆయా రెవెన్యూ గ్రామాలకు చెల్లించేందుకు శాఖాపరంగా ప్రణాళికను సిద్ధం చేశాం. అయితే ఉన్నతాధికారుల నుంచి మంజూరు చేయాలని ఎటువంటి ఉత్తర్వులు అందలేదు. ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నాం.

– తవిటయ్య, రిజిస్ట్రార్, గజపతినగరం కార్యాలయం

ఆక్రమణల తొలగింపులో వివాదం



అధికారులకు అభ్యంతరం చెబుతున్న షాపుల యజమానులు, గ్రామస్తులు

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామంలో జాతీయ రహదారి 26ను ఆనుకొని ఉన్న టిఫిన్ దుకాణాన్ని తొలగించేందుకు వచ్చిన ఎన్‌హెచ్, రెవెన్యూ అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. గుంటపల్లి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిఫిన్ దుకాణాన్ని తొలగించేందుకు వచ్చిన అధికారులకు స్థానికులు ఫిర్యాదుదారుకు కూడా ఆరు దుకాణాలు ఉన్నాయని వాటిని కూడా తొలగిస్తే తమకు అభ్యంతరం స్థానికులంతా ఒక్కటై అడ్డుకున్నారు. దీంతో గందరగోళం నెలకొంది. ఎవరో ఫిర్యాదు చేశారని ఒక్కరి దుకాణాన్ని తొలగించడం సరికాదని, తొలగించాలనుకుంటే ఆక్రమణలో ఉన్న అన్ని దుకాణాలను తొలగించాలని స్థానికులు అడ్డుకున్నారు. సర్వే నంబరు 71లోని 30తో పాటు 71లోని 31లో జాతీయ రహదారి 26కు సంబంధించి కొంత స్థలంలో పాటు కొండవాగు కాలువ స్థలంలో దుకాణాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. స్థానికుల వివాదంతో ఈ విషయాన్ని వచ్చిన అధికారులు తహసీల్దార్ రాజేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. చివరకు చేసేదేమీ లేక ఆర్డీవో దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. దీంతో పూర్తి స్థాయిలో సర్వే చేసిన తరువాత తొలగింపు ప్రక్రియ చేపడతామని వెనుదిరిగారు. ఆర్ఐ హరికృష్ణ, ఏఈఈలు సురేష్ కుమార్, రఘు, వీఆర్‌ఓలు కె.ప్రభాకరరావు, ఎస్.నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలకు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామరాజు

గంట్యాడ: బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్న గొడియాడకు చెందిన కుబిరెడ్డి వెంకటప్రసాద్(వెంకటేష్)పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గొడియాడ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇందుకూరి సీతారామరాజు డిమాండ్ చేశారు. గంట్యాడలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటేష్ గడిచిన 15 సంవత్సరాలుగా క్రికెట్ బుకీగా చేస్తున్నాడన్నారు. ఈయన చర్యలతో గ్రామంలో సుమారు 50 మంది వరకు యువకులు బెట్టింగ్‌లకు అలవాటు పడ్డారని తెలిపారు. ఒక్కొక్కరు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నష్టపోయారని తెలిపారు. దీంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేష్‌పై ఇటీవల విజయనగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని చెప్పారు. వెంకటేష్‌పై తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

సమ్మె నోటీసుల అందజేత



కోనూరు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి సమ్మె నోటీసును అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

లక్కవరపుకోట/కొత్తవలస : కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్లు సాధనకై ఈ నెల 20వ తేదీన సమ్మె చేయనున్నట్టు ఆశా, పారిశుధ్య కార్మికులు తెలిపారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో లక్కవరపుకోట మండలంలోని ఎంపీడీఓ ఎస్.అప్పారావుకి పారిశుధ్య కార్మికులు, కొత్తవలస మండల కేంద్రంలో గల పీహెచ్‌సీలో వైద్యురాలు సీతల్‌వర్మకు ఆశా కార్యకర్తలు సమ్మె నోటీసులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, ఆశా కార్యకర్తలకు నెలకు రూ.26 వేలు వేతనం అందజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని తదితర డిమాండ్‌లు సాధనకై 20వ తేదీన సమ్మె నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పారిశుధ్య కార్మికులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

చీపురుపల్లి రూరల్ (గరివిడి): కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.గౌరినాయుడు అన్నారు. మే 20న జరగనున్న సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొవాలంటూ కోనూరు పీహెచ్‌సీలో వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కీం వర్కర్స్ పట్ల మోదీ ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. అదే విధంగా కార్మికులకు అండగా ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ల కిందకు మార్చు చేసి యజమానులకు కార్మికులను బానిసలుగా చేస్తుందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను కాపాడుకోవటం కోసం చేపడుతున్న సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొవాలని పిలుపునిచ్చారు.

వ్యాన్ ఢీకొని యువకుడు మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ వై.మధుసూదనరావు

జి.సిగడాం: మండలంలోని ఉల్లివలస సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా మొరకముడిదాం మండలం పూతికవలస గ్రామానికి చెందిన గురాన అప్పలనాయుడు (37) మృతిచెందాడు. అప్పలనాయుడు చీపురుపల్లి నుంచి పూతికవలస వెళ్తున్న సమయంలో రాజాం మండలం కోశారిపురం నుంచి వస్తున్న బొలెరో వ్యాన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు.

నేడు మండల సమావేశం

దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అధ్యక్షతన బుధవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్టు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. అధికారులంతా మండల సమాచారంతో హాజరు కావాలని కోరారు. సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

9న గుర్రాల పరుగు పందెం పోటీలు

లక్కవరపుకోట: మండలంలోని తలారి గ్రామంలో శ్రీ సత్యవమ్మ పేరంటాల తీర్థ మహోత్సవం ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్టు నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీర్థం సందర్భంగా అదే రోజు తలారి గ్రామంలో రాష్ట్ర స్థాయి గుర్రాలు, ఎద్దుల పరుగు పందెం పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన యజమానులకు భారీ నగదు బహుమతులను అందజేయనున్నట్టు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో టాలెంట్ టెస్టులు జూనియర్, సీనియర్ విభాగాలకు వేర్వేరుగా నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లా స్థాయి కోలాటం పోటీలు నిర్వహించ నున్నారు. అదే రోజు ఉదయం 9 గంటల నుంచి మెడికవర్ ఆసుపత్రి వారిచే మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎంపీలు బొత్స ఝాన్సీలక్ష్మి, ఎంవీవీ సత్యనారాయణ తదితరులు హాజరు కానున్నట్టు ఆయన తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు

సాక్షి ఎఫెక్ట్

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వేతనదారులు పని కోల్పోయారన్న అంశంపై సాక్షిలో ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం అనే శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వేతనదారులకు పని కల్పించడంలో అలసత్వం వహించిన పెదవేమలి ఫీల్డ్ అసిస్టెంట్ వి.శ్రీనివాసరావుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఎందుకు తొలగించకూడదో కారణం తెలపాలని నోటీసులో పేర్కొన్నారు. మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని లేకుంటే కార్యాలయానికి అందిన ఆధారాల పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన



వేపాడలో కిశోర వికాసంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వేపాడ: మండలంలోని వేపాడ, నీలకంఠరాజపురం, బొద్దాం అంగన్‌వాడీ క్లస్టర్లలో వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా రుతుక్రమం, పరిశుభ్రత, లైంగిక విద్యపై బాలికలకు మంగళవారం అవగాహన కల్పించారు. సోంపురంలో ఏఎన్ఎం స్వప్నకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి బాలికలకు, గర్భిణులకు, బాలింతలకు రుతుక్రమం, పరిశుభ్రత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాలు జూన్ పదో తేదీ వరకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

రీ సర్వేను పరిశీలించిన ఆర్డీవో



వేపాడ మండలం ఆతవ రెవెన్యూ గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీసర్వేను విజయనగరం ఆర్డీవో దాట్లకీర్తి మంగళవారం పరిశీలించారు. పలు అంశాలపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రైతులకు ఎటువంటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉందన్నారు. అనంతరం వీలుపర్తి పంచాయతీ చామలాదేవీ అగ్రహారం సమీపంలో వున్న రాతి క్వారీ బ్లాస్టింగ్ పదార్థాల గిడ్డంగిని పరిశీలించారు. అనుమతులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ జె.రాములమ్మ, ఉప తహసీల్దార్ సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, వీఆర్‌ఓ, సిబ్బంది పాల్గొన్నారు. – వేపాడ

సాయిబాబా రథం ఊరేగింపు



సాయిబాబా వందో జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో సాయిబాబా రథాన్ని ఊరేగిస్తున్నట్టు సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వీవీఎస్ఎస్ సునీల్‌కుమార రథో తెలిపారు. గజపతినగరంలో పుట్టపర్తి సాయిసన్నిధి నుంచి వచ్చిన రథాన్ని సోమవారం రాత్రి డప్పు వాయిద్యాలతో భారీ భక్తుల నడుమ ఊరేగింపు నిర్వహించారు. బాబా చిత్ర పటాలకు భక్తులు హారతులిచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రామ సేవా ఇంచార్జ్ ఎం.సత్యనారాయణ, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ మనోహర్, సమితి కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు. – గజపతినగరం

విద్యార్థుల కిట్లపై డిప్యూటీ ఈవో ఆరా..



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లపై విజయనగరం డిప్యూటీ ఈవో కేవీ రమణ ఆరా తీశారు. వేపాడ ఎంఈవో కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. మండల స్టాక్ పాయింట్‌కు మొదటి విడతలో వచ్చిన 9400 పాఠ్య పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. కిట్లను క్రమ పద్ధతిలో ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవోలు నాగభూషణం, బాలభాస్కరరావు, ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్ఎంటీలు, పార్ట్ టైం సిబ్బంది ఉన్నారు. – వేపాడ

'కోట'లో కాంగ్రెస్ ర్యాలీ



ఎస్.కోట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. స్థానిక బాబా గుడి జంక్షన్ నుంచి పోస్టాఫీసు వరకు ర్యాలీ జరిగింది. ర్యాలీలో ఐదు మండలాల నాయకులు, మహిళా విభాగం సభ్యులు, బూత్ కమిటీల సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్ని వర్గాల శ్రేయస్సు – ఆశించేది కాంగ్రెస్ అంటూ నినదించారు. న్యాయ్‌పాత్ పేరుతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చింతల ఈశ్వరరావు, మహిళా ఇంచార్జ్ బీల జ్యోతి, జామి, ఎల్.కోట మండల పార్టీల అధ్యక్షుడు బోని అప్పారావు, మోహనరావు, జిల్లా పార్టీ కార్యదర్శి హెచ్.నానాజీ తదితరులు పాల్గొన్నారు. – శృంగవరపుకోట

ఉద్యోగులకు అభినందనలు



ఎస్.కోట ఆర్టీసీ డిపోలో ఉద్యోగులను సన్మానిస్తున్న డీఎం

శృంగవరపుకోట: పట్టణంలోని స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ కె.రమేష్ నేతృత్వంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్చి, ఏప్రిల్ మాసాల్లో ప్రయాణికులు ఉత్తమ సేవలు అందించి, ఫిర్యాదులు లేకుండా సంస్థకు మంచి ఆదాయం సమకూర్చిన కండక్టర్లు జి.వి.రమణ, కె.అచ్చయ్యమ్మ, జె.దేముడు, ఎల్.జగన్నాథం, బి.నిర్మల, ఇంధన పొదుపు పాటించిన డ్రైవర్లు పి.ఎస్.నాయుడు, బి.ఎస్.రాజు, ఎల్.అప్పారావు, ఓ.బి.రాజులను పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువలు కప్పి, నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలు ఇచ్చి డీఎం కె.రమేష్ సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.